మా భవిష్యత్తును కాపాడండి!

- శిలాజ ఇంధనాలకు ముగింపు పలకండి
- కాప్28 వేదికపైకి దూసుకెళ్లిన భారత బాలిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: దుబాయ్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సు-2023(కాప్28) సందర్భంగా అనూహ్య పరిణామం చోటుచేసుకొన్నది. లిసిప్రియా కంగుజం అనే మణిపూర్‌కు చెందిన 12 ఏండ్ల పర్యావరణ కార్యకర్త వేదికపైకి ఒక్కసారిగా దూసుకెళ్లింది. శిలాజ ఇంధనాలకు ముగింపు పలకాలని గట్టిగా నినాదాలు చేస్తూ ప్లకార్డును ప్రదర్శించింది. కొంత సేపు స్టేజీపైనే కూర్చొని నినాదాలు ఇచ్చింది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని ఆ బాలిక ఈ సందర్భంగా గట్టిగా వ్యతిరేకించింది. ఒక్కసారిగా వేదికపైకి రావడంతో సమావేశానికి హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు కొంత గందరగోళానికి గురయ్యారు. ఆ తర్వాత బాలిక ధైర్యాన్ని మెచ్చుకుంటూ అక్కడున్న వారు చప్పట్లతో ప్రశంసించారు. అనంతరం భద్రతా సిబ్బంది ఆమెను వేదికపై నుంచి కిందకు తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన లిసిప్రియా కంగుజం.. నిరసన తర్వాత తనను 30 నిమిషాల పాటు నిర్బంధించారని పేర్కొన్నారు. ఈనాటి పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణంగా ఉన్న శిలాజ ఇంధనాలకు ముగింపు పలకాలని తాను కోరడమే నేరమైందని, నిర్వాహకులు తనను కాప్28 సదస్సు నుంచి తొలగించారని తెలిపారు.

200 ఏండ్లలో మళ్లీ రావొచ్చేమో!

ఆర్టికల్ 370 రద్దుపై ఫరూక్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ఆర్టికల్ 370 రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంపై జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. ఆయన మంగళవారం ఒక మీడియా సంస్థ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తాము గౌరవిస్తున్నామన్నారు. అయితే దీనిపై తాము మరోసారి కోర్టుకు వెళ్తామని పేర్కొన్న ఆయన.. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. 'ఆర్టికల్ 370ని రద్దు చేసేందుకు 70 ఏండ్లు పట్టింది. ఏమో మరో 200 ఏండ్లలో అది మళ్లీ రావొచ్చేమో!' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 'గతంలో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఆర్టికల్ 370ని శాశ్వతంగా పేర్కొన్నది. అయితే అది నేడు నిలబడలేదు కదా! అదేవిధంగా భవిష్యత్తులో ఏం జరుగుతోందో కూడా చెప్పలేం' అని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అంశంపై సుప్రీంకోర్టు తీర్పుపై చైనా స్పందించింది. కశ్మీర్ సమస్యను భారత్, పాక్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ చెప్పుకొచ్చారు.

కేంద్రం యూటర్న్

నేర న్యాయ బిల్లులు వెనక్కి

- ఉపసంహరించుకొన్న బీజేపీ ప్రభుత్వం
- పలు మార్పులతో కొత్త ముసాయిదా బిల్లులను తిరిగి ప్రవేశపెట్టిన సర్కార్
- రేపు లోక్‌సభలో చర్చ.. ఎల్లుండి ఓటింగ్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ప్రస్తుతం దేశంలో అమల్లో ఉన్న నేర న్యాయ చట్టాల స్థానంలో తీసుకొచ్చిన బిల్లులను కేంద్రం వెనక్కు తీసుకొన్నది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. వాటి స్థానంలో పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసులతో కూడిన కొత్త ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాలను మారుస్తూ కేంద్రం భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం బిల్లులను ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఐదు విభాగాల్లో మార్పులు చేశామని, చాలా వరకు మార్పులు వ్యాకరణం, భాషకు సంబంధించినవేనని అమిత్‌షా తాజాగా పేర్కొన్నారు. కొత్త బిల్లులపై లోక్‌సభలో గురువారం చర్చ, శుక్రవారం ఓటింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రతిపక్ష ఎంపీల డిమాండ్ మేరకు ముసాయిదా బిల్లులపై అధ్యయనం చేసేందుకు వారికి 48 గంటల సమయం ఉందన్నారు. మూడు బిల్లులను జాయింట్ కమిటీకి పంపాలన్న డిమాండ్‌ను అమిత్‌షా తిరస్కరించారు.

'ఉగ్రవాదం' నిర్వచనంలో మార్పులు.. చేర్పులు

కొత్త ముసాయిదా బిల్లుల్లో 'ఉగ్రవాదం'కు నిర్వచనంలో మార్పు చేశారు. భారతీయ న్యాయ(రెండో) సంహిత బిల్లులో టెర్రరిజం నిర్వచనంలో 'ఆర్థిక భద్రత' అనే పదాన్ని కూడా చేర్చారు. 'దేశంలో లేదా విదేశాల్లో భారత ఐక్యత, సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రత లేదా ఆర్థిక భద్రతకు ముప్పు కలిగించేలా ఎవరైనా చర్యలకు పాల్పడితే.. ' అని మార్పు చేసిన కొత్త బిల్లు పేర్కొన్నది. పాత బిల్లులోని సెక్షన్ 73లో మార్పులు చేశారు. లైంగిక దాడి లేదా అలాంటి ఇతర నేరాల బాధితుల గుర్తింపు వివరాలను కోర్టు అనుమతి లేకుండా వెల్లడించేలా కోర్టు ప్రోసీడింగ్స్‌ను ప్రచురించడం శిక్షార్హమైనదిగా కొత్త బిల్లు పేర్కొన్నది. పాత నేర న్యాయ బిల్లులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధికారులు, సంబంధిత నిపుణులతో పలుమార్లు చర్చలు జరిపిందని, నవంబర్ 10న తన సిఫారసులతో కూడిన నివేదికను అందజేసిందని అమిత్‌షా సభలో వెల్లడించారు.

సీఈసీ హోదాపై వెనకడుగు

- సుప్రీం న్యాయమూర్తులతో సమానంగా హోదా
- మార్పులు విరమించుకున్న మోదీ సర్కారు
- విపక్షాలు, మాజీ సీఈసీల వ్యతిరేకత ఎఫెక్ట్
- ఎంపిక కమిటీలో సీజేఐ పేరు తొలగింపు
- మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల(ఈసీల) హోదా తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. గతంలో ఉన్నట్టుగానే సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా వీరి హోదాను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకొన్నది. అయితే ఎంపిక కమిటీ నుంచి సీజేఐ తొలగింపు నిబంధనను మాత్రం కొనసాగించింది. విధి నిర్వహణలో సీఈసీ, ఈసీలకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తూ కొత్త నిబంధనను బిల్లులో చేర్చింది. మంగళవారం ఈ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఈసీ స్వతంత్రతను దెబ్బతీసేలా నిబంధనలు ఉన్నాయని విపక్షాలు ఆరోపించాయి. ఈ బిల్లుతో ప్రభుత్వానికి జీ హుజూర్ అనే వ్యక్తులను అధికార పార్టీ నియమించే అవకాశం ఉందని విమర్శించాయి. ఇది ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుందని పేర్కొన్నాయి.

విమర్శలతో వెనక్కి..

ఈసీల నియామకాలకు సంబంధించి కేంద్రం 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక షరతులు, పదవీకాలం బిల్లు-2023'ను ఆగస్టులో రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఆ బిల్లులో ఈసీల హోదాలో మార్పులు చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమానంగా కాకుండా, క్యాబినెట్ సెక్రటరీలతో సమాన హోదాను ఇస్తామని ప్రతిపాదించింది. దీనిపై విపక్షాలు, మాజీ సీఈసీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఇది ఎన్నికల సంఘం స్వతంత్రతను దెబ్బతీయటమేనని ఆరోపించారు. దీంతో, వారి హోదాను మార్చకూడదని కేంద్రం నిర్ణయించింది. సీఈసీ, ఈసీలు పదవుల్లో ఉండగా, వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టకూడదని నిబంధన చేర్చింది. ఇటీవల తెలంగాణలో ఈసీపై ఒక జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ సవరణ చేర్చారు.

ఎంపిక కమిటీలో సీజేఐ తొలగింపు

ప్రస్తుతం ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రధాని నేతృత్వంలో సీజేఐ, విపక్ష నేత ఉంటారు. కానీ బిల్లులో సీజేఐని తొలగించి, ప్రధాని నియమించే క్యాబినెట్ మంత్రిని సభ్యులుగా చేర్చారు. ఈ సవరణపైనా విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అయితే, కేంద్రం దీనిలో ఎలాంటి మార్పులు చేయలేదు.

అక్రమ వలసదారుల వివరాల సేకరణ అసాధ్యం

సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: దేశంలో నివసిస్తున్న అక్రమ వలసదారుల వివరాలను సేకరించడం సాధ్యం కాదని కేంద్రం వెల్లడించింది. అనేక అక్రమ మార్గాలు, రహస్య ప్రదేశాల ద్వారా నిత్యం వలసదారులు దేశంలోని వివిధ ప్రాంతాల్లోకి చొరబడుతూ ఉంటారని, వారిని గుర్తించి, వివరాలు సేకరించడం సాధ్యం కాదని సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నది. అక్రమ వలసదారులకు దేశ పౌరసత్వాన్ని కల్పించేందుకు కేవలం అస్సాంకే పరిమితమైన పౌరసత్వ చట్టం 6ఏ రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తీర్పును రిజర్వ్ చేసింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారుల్లో 1966 జనవరి 1 నుంచి 1971 మార్చి 25 వరకు ఎంతమందికి భారత పౌరసత్వం ఇచ్చారంటూ ఈ నెల 7న సుప్రీం కోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. దేశంలో ఎంతమంది వలసదారులున్నారు, వారిని అడ్డుకోవడానికి కేంద్రం ఏం చర్యలు తీసుకుంటున్నదని అడిగింది. 17,681 మంది వలసదారులకు భారత పౌరసత్వాన్ని కల్పించినట్టు కేంద్రం తెలిపింది. వేలాది మంది వలసదారులు దేశంలోకి చొరబడుతుంటారని, వారిని గుర్తించడం, నిలువరించడం సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొంది. అయినప్పటికీ 2017-2022 మధ్య దేశంలో అక్రమంగా తిష్టవేసిన 14,346 మంది విదేశీయులను గుర్తించి వెనక్కి పంపినట్టు తెలిపింది. అస్సాంలో ప్రస్తుతం వంద ఫారిన్ ట్రిబ్యునల్స్ పనిచేస్తున్నాయని, దీని ద్వారా ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి 3.34 లక్షల కేసులను పరిష్కరించినట్టు పేర్కొన్నది.

ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

టెన్త్, ఇంటర్ పరీక్షలు ఒకేరోజు ప్రారంభం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ఇంటర్, టెన్త్ బోర్డు పరీక్షల తేదీలను సీబీఎస్ఈ ప్రకటించింది. ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్, టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 13న టెన్త్ పరీక్షలు ముగుస్తాయి. ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ మేరకు పరీక్షల పూర్తి టైమ్‌టేబుల్‌ను సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించింది. జేఈఈ మెయిన్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఇంటర్ పరీక్షల తేదీలను నిర్ణయించినట్టు వెల్లడించింది. అలాగే ఒక్కో పరీక్షకు మధ్య విద్యార్థులకు ప్రిపరేషన్ కోసం తగిన సమయం ఉండేలా ఏర్పాటుచేసినట్టు సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సాన్యమ్ భరద్వాజ్ తెలిపారు.

సంజయ్‌రౌత్‌పై రాజద్రోహం కేసు

యావత్మాల్, డిసెంబరు 12: శివసేన (ఉద్ధవ్ వర్గం) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్‌పై రాజద్రోహం కేసు నమోదైంది. శివసేన వార్తాపత్రిక 'సామ్నా'లో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర కథనాన్ని రాసినందుకు యావత్మాల్ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీజేపీ యావత్మాల్ జిల్లా కోఆర్డినేటర్ నితిన్ భుటాడా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సామ్నా పత్రికకు రౌత్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 10న మోదీపై అభ్యంతరకర కథనం ప్రచురితమైందన్న నితిన్ ఫిర్యాదుతో సోమవారం ఉమర్‌ఖేడ్ పోలీస్ స్టేషన్‌లో రౌత్‌పై రాజద్రోహం సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది.

యూటీ అసెంబ్లీల్లో మహిళా రిజర్వేషన్

బిల్లులకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: కేంద్ర పాలిత ప్రాంతాలైన(యూటీ) పుదుచ్చేరి, జమ్ము కశ్మీర్ శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే జమ్ము కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం(రెండో సవరణ), కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వం(సవరణ) బిల్లులకు మంగళవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇందు కోసం జమ్ము కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2019, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం-1963కి సవరణలు చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కొనసాగింపుగా ఈ రెండు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.

పోస్టుమార్టంలో కండ్లు మాయం

బుదాన్ (యూపీ), డిసెంబర్ 12: ఉత్తరప్రదేశ్‌లో అవయవాల అక్రమ దందా జరుగుతున్నట్టు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల కిందట బుదౌన్ జిల్లాలో వరకట్నం హత్య జరిగింది. ఓ యువతిని చంపి ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. అయితే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. పరిశీలించిన కుటుంబసభ్యులు మృతదేహానికి కండ్లు లేవని గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం సందర్భంగా కండ్లను తీసి అవయవాల అక్రమ దందా నిర్వహిస్తున్నారని ప్రభుత్వ వైద్యులపై ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు.

రూ.1,444 కోట్ల ఇల్లు కొన్న పూనావాలా

లండన్, డిసెంబర్ 12: కొవిడ్ టీకా కొవిషీల్డ్ ఉత్పత్తి చేసే సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా లండన్‌లో ఖరీదైన భవనాన్ని కొనుగోలు చేశారు. 1920లో హైడ్ పార్క్ దగ్గర నిర్మించిన ఈ 25 వేల చదరపు అడుగుల భవనం కొనుగోలు ఈ ఏడాది లండన్‌లో రెండో అత్యంత ఖరీదైన ఇంటి అమ్మకంగా తెలుస్తున్నది. పోలెండ్ వ్యాపారవేత్త జాన్ కల్క్‌జిక్ కూతురి నుంచి సుమారు రూ.1,444.4 కోట్లకు పూనావాలా ఈ ఇంటిని కొనుగోలు చేశారు. పూనావాలా కుటుంబ సంస్థ అయిన సీరమ్ లైఫ్ సైన్సెస్ ఈ భవనం కొన్నట్టు తెలుస్తున్నది. తాజాగా కొన్న ఇల్లు వారి కంపెనీకి స్థావరంగా ఉపయోగపడుతుందని సమాచారం.

కాంగ్రెస్ ఉండగా.. మనీ హైస్ట్ ఎందుకు దండగ: మోదీ

న్యూఢిల్లీ: ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూకు చెందిన సంస్థల్లో పెద్దయెత్తున నగదు పట్టుబడటంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. దేశంలో కాంగ్రెస్ లాంటి పార్టీ ఉండగా 'మనీ హైస్ట్ (నగదు దోపిడీ)' లాంటి వెబ్‌సిరీస్‌లతో పనేముందని వ్యాఖ్యానించారు. 'భారత్‌లో 70 ఏండ్ల పురాతన కాంగ్రెస్ పార్టీ దోపిడీ కొనసాగుతుండగా మనీ హైస్ట్ లాంటి కల్పిత గాథలు ఎవరికి అవసరం' అని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ పెట్టిన వీడియోను ఆయన జత చేశారు. ఇటీవల సాహు వ్యాపార సంస్థల ఆవరణలో ఐటీ అధికారులు దేశంలోనే అతిభారీ మొత్తంలో రూ.351 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నాపై దాడికి సీఎం కుట్ర

కేరళ సీఎం విజయన్‌పై గవర్నర్ ఆరిఫ్ ఆరోపణ

న్యూఢిల్లీ: కేరళ ముఖ్యమంత్రి విజయన్‌పై ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ మంగళవారం తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై భౌతిక దాడికి కుట్ర పన్నారని, ముఖ్యమంత్రి ఆదేశానుసారమే సీపీఐ(ఎం) అనుబంధ సంస్థ ఎస్ఎఫ్ఐకి చెందిన విద్యార్థులు తన కారుపై దాడి చేశారని అన్నారు. తిరువనంతపురం ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న గవర్నర్ కారుపై ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు దాడి చేశారు. దీనిపై ఆరిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నివేదిక సమర్పించాలని తను ఆదేశాలు ఇచ్చిన క్రమంలోనే ఈ దాడి యత్నం జరిగిందని ఆయన చెప్పారు. 'నేను అడిగిన సమాచారం ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని సీఎం అంటున్నారు. ప్రభుత్వం సంక్షోభంలో ఉంటే దానిపై తగు సిఫార్సులు చేయడం గవర్నర్‌గా నా విధి' అంటూ ఆయన హెచ్చరించారు.

రాజస్థాన్ సీఎంగా భజన్‌లాల్

- బ్రాహ్మణ నేత వైపు బీజేపీ హైకమాండ్ మొగ్గు
- మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తికి పగ్గాలు
- పదవి ఆశించిన వసుంధరా రాజేకు అభిష్టానం ఝలక్!
- డిప్యూటీ సీఎంలుగా దియాకుమారి, ప్రేమ్‌చంద్

జైపూర్, డిసెంబర్ 12: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో కొత్త ముఖ్యమంత్రుల ఎంపిక విషయంలో ఎవరూ ఊహించని విధంగా సంచలన నిర్ణయం తీసుకొన్న బీజేపీ.. రాజస్థాన్‌లోనూ అదే పంథా కొనసాగించింది. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన బ్రాహ్మణ వర్గానికి చెందిన భజన్‌లాల్ శర్మను అనూహ్యంగా ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం జైపూర్‌లో సమావేశమైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు భజన్‌లాల్‌ను పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ హైకమాండ్ పరిశీలకులుగా ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని బృందం హాజరైంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మాదిరిగానే రాజస్థాన్‌లోనూ అసలు సీఎం రేసులోనే పేరు వినిపించని వ్యక్తిని బీజేపీ సీఎంగా ఎంపిక చేయడం గమనార్హం. ముఖ్యమంత్రి సీటు కోసం గట్టిగా ప్రయత్నించిన మాజీ సీఎం వసుంధరా రాజేనే ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం అభ్యర్థిగా భజన్‌లాల్ పేరును ప్రకటించడం గమనార్హం. ఉప ముఖ్యమంత్రులుగా ఇద్దరి నేతలను బీజేపీ ప్రకటించింది. సీఎం రేసులో ప్రముఖంగా పేరు వినిపించిన దియా కుమారితో పాటు ప్రేమ్ చంద్ బైర్వాలకు డిప్యూటీ సీఎంలుగా అవకాశం కల్పించింది. అసెంబ్లీ స్పీకర్‌గా వాసుదేవ్ దేవనానిని ఎంపికచేసింది. రాజస్థాన్‌లో గత నెల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 199 స్థానాలకు గానూ బీజేపీ 115 సీట్లలో విజయం సాధించింది. అధికార కాంగ్రెస్ పార్టీ 69 సీట్లకు పరిమితమైంది.

చివరి వరుస నుంచి ప్రభుత్వాధినేతగా..

56 ఏండ్ల భజన్‌లాల్ శర్మ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. నాలుగు సార్లు ఈ పదవి చేపట్టారు. ఆయనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) మద్దతు ఉన్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన సంగనేర్ నియోజకవర్గం నుంచి 48 వేల ఓట్లకు పైగా మెజార్టీతో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఏబీవీపీతోనూ గతంలో సంబంధాలు ఉన్నాయి. భజన్‌లాల్ పొలిటికల్ సైన్స్‌లో పీజీ చేశారు. కాగా, శాసనసభా పక్ష సమావేశానికి ముందు ఎమ్మెల్యేలు తీసుకొన్న గ్రూపు ఫొటోలో చివరి వరుసలో నిలబడిన భజన్‌లాల్ శర్మనే ఇప్పుడు ప్రభుత్వ పగ్గాలు చేపడుతుండటం గమనార్హం.

అనూహ్యంగా తెరపైకి భజన్‌లాల్

అసెంబ్లీ ఫలితాల వెల్లడి తర్వాత గత వారం రోజులుగా కొత్త సీఎంగా పలువురి పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఈ జాబితాలో మాజీ సీఎం వసుంధరా రాజే వంటి వాళ్లు ఉన్నారు. ఫలితాల వచ్చిన నాటి నుంచే సీఎం పదవి పొందేందుకు రాజే గట్టిగా ప్రయత్నాలు చేశారు. వరుసగా పలుమార్లు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో సమావేశం అవుతూ అధిష్టానానికి తన బలాన్ని చూపించే ప్రయత్నం చేశారు. వసుంధరా రాజేతోపాటు రాజస్థాన్ యోగిగా పేరుపొందిన బాబా బాలక్‌నాథ్, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్ మేఘ్వాల్ పేర్లు కూడా సీఎం రేసులో ప్రముఖంగా వినిపించాయి. అయితే వీరందరినీ కాదని రాష్ట్రానికి కొత్త సీఎంగా బీజేపీ అధిష్టానం తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన భజన్‌లాల్ శర్మ వైపు మొగ్గు చూపడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

ఏడుస్తున్న కార్యకర్తలను ఓదార్చుతున్న శివరాజ్‌సింగ్ చౌహాన్

అలా అడగటం కన్నా.. చావటం మేలు

వీడ్కోలు సమావేశంలో చౌహాన్ భావోద్వేగం

భోపాల్, డిసెంబర్ 12 : మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్‌ను ఎంపికచేస్తూ బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం ఆ పార్టీలో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. మధ్యప్రదేశ్ సీఎంగా అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్, మంగళవారం అందరికీ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భోపాల్‌లోని సీఎం నివాసంలో జరిగిన వీడ్కోలు సమావేశంలో చౌహాన్ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన్ని కలిసిన బీజేపీ మహిళా కార్యకర్తలు భోరుమని విలపించారు. ఈ సందర్భంగా చౌహాన్ విలేకరులతో మాట్లాడుతూ, తన కోసం ఇది కావాలని పార్టీ అధిష్టానాన్ని అడగటం కన్నా చావటం మేలని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎంగా మోహన్ యాదవ్‌ను ఎంపిక చేస్తూ బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని అంగీకరిస్తున్నానని చెప్పారు. కొత్త సీఎంకు అన్ని విధాలుగా సహకరిస్తానని పేర్కొన్నారు. అత్యంత సుదీర్ఘ కాలంపాటు రాష్ట్ర సీఎంగా శివరాజ్ సింగ్ చరిత్ర సృష్టించారు. 2005 నుంచి 2018వరకు, ఆ తర్వాత 2020 నుంచి 2023 వరకు సీఎంగా ఉన్నారు.

డూమ్స్ డే ఇండ్లు!



- యుగాంతం నుంచి తప్పించుకొనేందుకు స్థావరాలు
- 575 శక్తిమంతమైన బంకర్లు నిర్మించిన యూఎస్ కంపెనీ
- 10 వేల మంది ఏడాదిపాటు ఉండేలా నిర్మాణాలు
- అద్దె రూ.46 లక్షలు.. బుకింగ్స్‌కు మిలియనీర్ల క్యూ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): 2012లో ప్రపంచం అంతమైపోతుందన్నారు. దీనిపై ఏకంగా ఓ సినిమానే వచ్చింది. అయితే, అలా ఏమీ జరుగలేదు. అయినప్పటికీ, యుగాంతం మీద చర్చ ఎప్పుడూ జరుగుతూనే ఉన్నది. ప్రళయం వచ్చినా తాను, తన కుటుంబ సభ్యుల ప్రాణాలను భద్రంగా కాపాడుకోవాలన్న ఆశ ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. అలాంటివారి కోసం అమెరికాలోని ఓ సంస్థ అత్యంత శక్తిమంతమైన ఇండ్లను నిర్మిస్తున్నది. అవే 'డూమ్స్ డే ఇండ్లు'

ఏమిటీ ఇండ్లు?

అమెరికాకు చెందిన వివోస్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ అత్యంత శక్తిమంతమైన బంకర్లలాంటి ఇండ్లను నిర్మిస్తున్నది. వీటినే 'డూమ్స్ డే ఇండ్లు'గా పిలుస్తున్నారు. భూమి లోపల వీటి నిర్మాణాన్ని చేపడుతున్నది. భూకంపాలు, ప్రచండ గాలులు, సునామీలను తట్టుకొనే విధంగా ప్రత్యేకమైన కాంక్రీటు, ఇనుము, స్టీల్‌తో పది అడుగుల వెడల్పాటి గోడలతో ఈ ఇండ్లను సిద్ధం చేస్తున్నారు.

ధర ఎంత?

ప్రాథమికంగా 575 ఇండ్లను నిర్మించేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో 10 వేల మంది ఏడాదిపాటు నివాసం ఉండేలా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. అద్దె రూ. 46 లక్షలుగా ఖరారు చేసినట్టు వివరించారు. ఇప్పటికే పలువురు మిలియనీర్లు ఇండ్లను బుకింగ్ చేసుకొన్నట్టు చెప్పారు.

'డూమ్స్ డే క్లాక్'తో కొత్త భయాలు

*భూగోళంపై మానవాళి అంతం లేదా ప్రళయాన్ని సూచించే 'డూమ్స్ డే క్లాక్'లో సమయాన్ని మిడ్‌నైట్‌కు కేవలం 90 సెకండ్ల ముందుకు ఇటీవల సెట్ చేశారు. 1991లో కోల్డ్ వార్ ముగిసిన తర్వాత 17 నిమిషాలుగా ఉన్న క్లాక్ టైమింగ్, 90 సెకండ్లకు తగ్గించడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతున్నది. కరోనా, వాతావరణంలో మార్పులు, కొత్త వ్యాధులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా ఉదంతం, అణ్వాయుధాల బెదిరింపులు వెరసి ఈ సంక్షోభాలు ఇలాగే కొనసాగితే.. ప్రపంచం అంతమవడానికి ఎంతో కాలంపట్టదన్న అభిప్రాయం సర్వత్